క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన ఇన్‌చార్జి ఎంపీడీవో



బూచేపల్లి వెంకాయమ్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీతారామారావు

చీమకుర్తి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను చీమకుర్తిలోని ఆమె నివాసంలో చీమకుర్తి ఇన్‌చార్జి ఎంపీడీవో కే సీతారామారావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చీమకుర్తి ఎంపీడీవోగా పనిచేస్తున్న బీజే వండర్‌మ్యాన్‌ను జిల్లా పరిషత్‌లో రిపోర్ట్ చేయమని ఉన్నతాధికారులు ఆదేశాలివ్వడంతో చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న కే సీతారామారావు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించి మర్యాదపూర్వకంగా బూచేపల్లి వెంకాయమ్మను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

నేడు దేవరపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

చీమకుర్తి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం దేవరపాలెం గ్రామంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, దేవరపాలెం నాయకుడు పులి వెంకటరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు మండలంలోని పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఇంధనం నింపుకునేందుకు ఆగిన హెలికాప్టర్



సాయి విష్ణు విల్లాస్‌లోని హెలిప్యాడ్‌లో దిగిన హెలికాప్టర్

నాగులుప్పలపాడు: మండలంలోని చదలవాడ సమీపంలో నిర్మిస్తున్న సాయి విష్ణు విల్లాస్‌లో గల హెలిప్యాడ్‌లో బుధవారం డబుల్ ఇంజిన్ హెలికాప్టర్ ఇంధనం నింపుకునేందుకు దిగినట్లు సాయి విష్ణు విల్లాస్ ఎండీ కంది రవిశంకర్ తెలిపారు. బెంగళూరు నుంచి పాట్నా వెళ్తున్న హెలికాప్టర్ ఇంధనం నింపుకుని పాట్నా వెళ్లినట్లు వెల్లడించారు.

రాష్ట్ర స్థాయి ట్రాన్స్‌జెండర్ల సమావేశానికి సాయిశ్రీ

ఒంగోలు టౌన్: విజయవాడలో ఈ నెల 8, 9 తేదీల్లో రెండురోజుల పాటు నిర్వహించనున్న ట్రాన్స్‌జెండర్ల కమ్యూనిటీ రాష్ట్ర స్థాయి సమావేశానికి ప్రకాశం జిల్లా నుంచి సాయిశ్రీ, అనుప్రియాంక ఎన్నికైనట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ట్రాన్స్‌జెండర్ల హక్కులపై చర్చించనున్నట్లు వారు తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం

చీమకుర్తి: పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో ప్రజ్ఞా వికాసం జిల్లా స్థాయి పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పరీక్షల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారికి రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.3 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.1,500 బహుమతిగా అందించనున్నట్లు ఎస్ఎఫ్ఐ చీమకుర్తి నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీమకుర్తి మండలంలోని పదో తరగతి విద్యార్థులు చీమకుర్తిలోని గౌతమి డిగ్రీ కాలేజీలో నిర్వహించే పరీక్షకు హాజరుకావాలని కోరారు.

ఎఫ్ఏ-3 పరీక్షల పరిశీలన

పుల్లలచెరువు: అన్ని యాజమాన్యాల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నుంచి క్లాస్ రూమ్ బేస్డ్(సీబీఏ) ఎఫ్ఏ-3 పరీక్షలు ప్రారంభమయ్యాయని ఎంఈఓ శామ్యూల్‌జాన్ తెలిపారు. బుధవారం నుంచి ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు నిర్వహిస్తుండగా.. నాయుడుపాలెం పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి ఓఎంఆర్ షీట్లను ఎంఈఓ కార్యాలయానికి పంపాలని సూచించారు. 12వ తేదీ లోగా మూల్యాంకనం పూర్తి చేసి, 14వ తేదీలోగా మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.



ఎఫ్ఏ-3 పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈఓ

ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలుచేయాలి

- ఒంగోలు మండలంలోని కార్యదర్శులతో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

ఒంగోలు రూరల్: సచివాలయాల కార్యదర్శులు ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలుచేయాలని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల సచివాలయాల కార్యదర్శులతో ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యదర్శులకు ప్రభుత్వం అందజేసిన మొబైళ్లు వినియోగంలో ఉన్నాయా.. లేదా..? అనే సమాచారం సేకరించారు. వలంటీర్లకు అందజేసిన మొబైల్స్ ఎన్ని వినియోగంలో ఉన్నాయి, ఎంత మంది వినియోగిస్తున్నారు, ఎన్ని మొబైల్స్ రిపేర్‌లో ఉన్నాయనే సమాచారాన్ని ఆయా గ్రామాల కార్యదర్శులు ఎంపీడీవోకి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన పెంచుకుని ప్రజల్లోకి వేగంగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు.

ఒంగోలు మండలంలోని సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ విషయంలో ఇంకా నిర్లక్ష్యంగా ఉంటున్నారని, ఇకపై ఆకస్మిక తనిఖీలు ఉంటాయని, బయోమెట్రిక్ వేయని వారికి మెమోలు జారీ చేస్తామని ఎంపీడీవో హెచ్చరించారు. కార్యక్రమంలో పాల్గొన్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఆయా గ్రామ సచివాలయాల్లో రూ.110 చెల్లించి వైఎస్సార్ బీమా పాలసీ పొందవచ్చని తెలిపారు. వైఎస్సార్ బీమాలో ప్రధాన సంపాదితులుగా నమోదైన వారు, భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులుగా పనిచేసే వారికి నమోదు, గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అర్హతలపై ఏసీఎల్, ఏఎల్‌వో మాట్లాడారు. గుర్తింపు కార్డు వలన ప్రసూతి సహాయం, పిల్లల వివాహాలకు ఆర్థిక సాయం అందుతుందన్నారు. వయసు 18 నుంచి 60 సంవత్సరాలు ఉండాలని, సంవత్సరంలో 90 రోజులు పని చేయాలని తెలిపారు. గుర్తింపు కార్డు కోసం ప్రొఫార్మా 27 ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు ఫొటోలు, సభ్యత్వ రుసుము రూ.50, 5 సంవత్సరాలకు వార్షిక చందా రూ.12 కలిపి మొత్తం రూ.110 చెల్లించి మండల పరిధిలోని 21 సచివాలయాల్లో 4,794 మంది గుర్తింపు కార్డులు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, వంశీ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆరోగ్యంపై శ్రద్ధ



ఫీల్డ్ అసిస్టెంట్లకు కిట్లు అందజేస్తున్న ఎంపీపీ దంపతులు

నాగులుప్పలపాడు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో పని చేసే కూలీల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు అత్యవసర ప్రాథమిక కిట్లను బుధవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పని ప్రదేశంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఆస్పత్రికి తరలించేలోపు ఈ అత్యవసర కిట్లు చాలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుకుమారి, ఏపీవో ధనుంజయ్, వినోదరాయునిపాలెం గ్రామ సర్పంచ్ ఘట్టమనేని అశోక్, ఈసీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్ త్వరగా పూర్తి చేయాలి



జయప్రకాష్‌కాలనీలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు అర్బన్: స్థానిక జయప్రకాష్ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఓఎంసీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జయప్రకాష్ కాలనీ, నేతాజీ కాలనీల్లో పర్యటించి పారిశుధ్యం, తాగునీటి సరఫరా తదితర అంశాలపై ప్రజలతో మాట్లాడారు. కాలనీల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, తాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. నేతాజీ కాలనీలో రోడ్డు సమస్యను పరిష్కరించాలని, కాంట్రాక్టర్లతో మాట్లాడి రెండు రోజుల్లో పనులు ప్రారంభించాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రితో సమస్యలపై చర్చించిన ఎంపీ మాగుంట

ఒంగోలు: కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖామంత్రి నితిన్ గడ్కరీని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కలిసి ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు. సింగరాయకొండ వద్ద విమానాల అత్యవసర ల్యాండింగ్ ఏర్పాట్లు పూర్తిచేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. గిద్దలూరులో రాచర్ల రైల్వే గేటు వద్ద రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి లేకపోవడం వల్ల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అక్కడ రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జికి సెంట్రల్ సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరు చేయాలన్నారు. సీఎస్ పురం మండలం అంబవరం గ్రామం వద్ద భైరవేశ్వర స్వామి దేవస్థానానికి వెళ్లేందుకు భక్తులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నుంచి దేవస్థానం వరకు మూడు కిలోమీటర్ల సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందిస్తూ రైల్వే ఓవర్ బ్రిడ్జికి సెంట్రల్ సీఆర్ఐఎఫ్ నిధుల మంజూరుకు, బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ హైవే నుంచి శ్రీభైరవేశ్వరస్వామి దేవస్థానం వరకు 3 కిలోమీటర్ల మేర సర్వీసు రోడ్డు ఏర్పాటుకు, సింగరాయకొండ వద్ద విమానాల అత్యవసర ల్యాండింగ్ ఫెసిలిటీ ఏర్పాట్లు పూర్తి చేసేందుకు నిధుల మంజూరుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎంపీ మాగుంట తెలిపారు.

ఈకేవైసీ తప్పనిసరి



ఈకేవైసీ చేయిస్తున్న ఏవో, డీఆర్‌సీ ఏవో

మద్దిపాడు: మండలంలోని ప్రతి రైతు సాగుచేసిన పంటలను నమోదు చేయడంతో పాటు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.రమేష్ సిబ్బందికి సూచించారు. మండలంలోని వెల్లంపల్లి కొలచనకోట, మద్దిపాడు గ్రామాల్లోని ఆర్‌బీకేలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట నమోదు చేయించుకోవడం వలన విపత్తుల సమయంలో నష్టపరిహారం పొందడానికి, పంట చేతికొచ్చిన సమయంలో కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆయా గ్రామాల్లో సాగుచేస్తున్న వరి, మొక్కజొన్న, శనగ, పొగాకు పంటలను పరిశీలించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఆయన వెంట డీఆర్‌సీ ఏవో శైలజారాణి, ఏఈవో శేషయ్య, వీఏఏలు సాగర్, హరితేజ, రేణుక, పలువురు రైతులు పాల్గొన్నారు.

పొగాకు పంటను పరిశీలించిన బోర్డు అధికారులు



పొగాకును పరిశీలిస్తున్న వేలం నిర్వహణ అధికారులు, బోర్డు అధికారులు

ఒంగోలు రూరల్: మండల పరిధిలోని మండువారిపాలెం, సర్వేరెడ్డిపాలెం, వెంగముక్కలపాలెం, నరసాయపాలెం, నేలటూరు, లింగంగుంట గ్రామాల్లో సాగుచేస్తున్న పొగ తోటలను పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఆధ్వర్యంలో పొగాకు బోర్డు ప్రతినిధులు బుధవారం పరిశీలించారు. ఆర్ఎంసీఎస్‌బీఎస్, ఎఫ్ఎఫ్‌టీఎం ఒంగోలు రీజినల్ పరిధిలోని పలు గ్రామాలను సందర్శించారు. గ్రామాల్లో రైతులు పెంచుతున్న పొగ తోటలను పరిశీలించి ఆకు రెలుపు, క్యూరింగ్, గ్రేడింగ్‌లపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. పొగాకు గ్రేడింగ్‌లో తీసుకోవాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు. పొగాకు పంటలో పేను బంక తెగులును నివారించేందుకు కాన్ఫిడార్ 3 ఎంఎల్‌ను 10 లీటర్ల నీటిలో లేదా అక్తారా 3 ఎంఎల్‌ను 10 లీటర్ల నీటిలో కలిపి ఒకదాని తర్వాత ఒకటి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పొగాకు వేలం నిర్వహణ అధికారులు ఎం.రవికాంత్, కె.రామకృష్ణ, ఎస్‌జీవో తులసి, ఆర్ఎంవో వెంకట్రావు, ఐటీసీ ప్రతినిధులు ప్రసాద్, బోర్డు టెక్నికల్ స్టాఫ్, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి



ఇళ్ల లబ్ధిదారులతో సమావేశమైన కమిషనర్, కౌన్సిలర్లు

చీమకుర్తి: జగనన్న కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా లబ్ధిదారులకు తెలిపారు. కలెక్టర్, హౌసింగ్ డిపార్టుమెంట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చీమకుర్తిలోని 1వ సచివాలయం పరిధిలోని గృహాల లబ్ధిదారులతో స్థానిక సచివాలయం పరిధిలోని కౌన్సిలర్లు టీ బాబూరావు, జీ అనసూర్యమ్మ, బీ వెంకట్రావుతో కలిసి కమిషనర్ బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్, కౌన్సిలర్లు మాట్లాడుతూ రానున్న ఉగాది నాటికి అసంపూర్ణంగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయాలన్నారు.

కళ్యాణ్ అన్నయోజన అసెంబ్లీ ఇన్‌చార్జులు వీరే

ఒంగోలు: ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజన అసెంబ్లీ ఇన్‌చార్జుల జాబితాను భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి బుధవారం మీడియాకు విడుదల చేశారు. ఒంగోలు–బొద్దులూరి ఆంజనేయులు, కొండపి–మిడసల బాలకోటయ్య, దర్శి–మడపాకుల శ్రీనివాస్, కనిగిరి–మాదినేని లక్ష్మణ యాదవ్, మార్కాపురం–కళ్లం సుబ్బారెడ్డి, గిద్దలూరు–కొమ్మాలపాటి చంద్రమోహన్, యర్రగొండపాలెం–సింగ ప్రసాద్‌ను నియమించినట్లు వెల్లడించారు.

రేషన్ సక్రమంగా ఇవ్వడం లేదు



తహసీల్దార్ దాసుకు వినతిపత్రం అందజేస్తున్న సింగుపల్లి గ్రామస్తులు

పుల్లలచెరువు: తమకు రేషన్ సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదని మండలంలోని సింగుపల్లి గ్రామవాసులు బుధవారం తహసీల్దార్ దాసుకు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. సక్రమంగా రేషన్ సరకులు ఇవ్వాలని డీలర్‌ను అడిగితే దిక్కున్న చోట చెప్పుకోండని అంటున్నాడని, పెద్దలు ఎవరు లేని సమయంలో వచ్చి పిల్లలతో వేలిముద్రలు వేయించుకుని వెళ్తున్నాడని వివరించారు. మూడు నెలల నుంచి సరుకులు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ విషయమై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ.. ఆర్ఐ, వీఆర్వోతో విచారణ చేపట్టి డీలర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీ చేయాలి



సామాజిక తనిఖీపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సుజాత

కొత్తపట్నం: 2021–22 ఆర్థిక ఏడాదికి సంబంధించి ఎన్ఆర్ఈజీఎస్ పనుల సామాజిక తనిఖీని పారదర్శకంగా చేయాలని ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సామాజిక తనిఖీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన నిధులతో నిర్వహించిన అభివృద్ధి పనులు, ఉపాధి మట్టి పనులను బాధ్యతాయుతంగా, నిష్పక్షపాతంగా తనిఖీ చేయాలని సూచించారు. ఏడాదికి ఒకసారి జరిగే సామాజిక తనిఖీకి టీం రావడం జరిగిందన్నారు. డిస్ట్రిక్ట్ విజిలెన్స్ ఆఫీసర్ పి.వెంకటస్వామి మాట్లాడుతూ ప్రభుత్వంలో పనిచేసే ప్రతిఒక్కరూ తన పనితీరుని, జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి ఈ సామాజిక తనిఖీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎస్.మధుసూదన్‌రావు మాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వహించే ప్రజా వేదికలో ఆ గ్రామంలో వచ్చిన అభ్యంతరాలను చదివి వినిపించడం జరుగుతుందన్నారు. మస్టర్లలో ఎటువంటి కొట్టివేతలు లేకుండా ఉండాలని, ఏడు రిజిష్టర్లు సక్రమంగా ఉండాలని, ప్రతి ఒక్క పనిలో బోర్డులు పెట్టాలని సూచించారు.

కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ మల్లికార్జున్‌రెడ్డి, వీరభద్రారెడ్డి, స్టేట్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ జి.శ్రీకాంత్, చంద్రశేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



అధికారులతో చర్చిస్తున్న దర్శి సీఐ

తాళ్లూరు: మండలంలోని విఠలాపురం పంచాయతీలో ఉపాధి పనుల బిల్లుల చెల్లింపుల్లో జరిగిన నిధుల దుర్వినియోగంపై నమోదైన కేసులో బుధవారం దర్శి సీఐ రామకోటయ్య విచారణ చేపట్టారు. ఎంపీడీఓ కేవై కీర్తి, ఈఓఆర్డీ ప్రసన్నకుమార్‌తో కలిసి కేసు నమోదయ్యే వరకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఏఎస్ఐ మోహన్‌రావు ఆయన వెంట ఉన్నారు.

ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్ఓ తనిఖీ



వైద్యశాలను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి

పెద్దదోర్నాల: మండల పరిధిలోని కొర్రప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వైద్య సిబ్బందితో మాట్లాడుతూ.. వైద్యశాలకు వచ్చే గర్భిణుల వివరాలు ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. గర్భిణులకు అవసరమైన ఐరన్ మాత్రలు, ఇతర మందులను క్రమం తప్పకుండా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శంకర్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు కష్టపడి చదవాలి



విద్యార్థినికి బహుమతులు అందిస్తున్న వైద్యాధికారులు

ముండ్లమూరు: విద్యార్థినులు చిన్నతనం నుంచే లక్ష్యంతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని వైద్యాధికారులు జ్యోతి, జాస్మిన్ అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు వారు బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలుసుకోవాలన్నారు. రాజ్యాంగం ప్రసాదించి హక్కులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసపత్రం, బహుమతులు అందజేశారు. దళిత బహుజన రీసోర్స్ సెంటర్ జిల్లా కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, మండల కమ్యూనిటీ మొబలైజర్ గోపనబోయిన వెంకట్రావు, ప్రిన్సిపాల్ ఆవుల సునీత పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చినగంజాం: కడవకుదురులో గ్రామంలో అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం ఉదయం పట్టుకున్నారు. ఎస్ఐ కట్టా అనూక్ తెలిపిన వివరాలు ప్రకారం కడవకుదురులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్లి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి ట్రాక్టర్ డ్రైవర్, యజమాని ఆరిగ తిరుమలరావును అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

వేలం పాట వాయిదా

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు చెరువులో చేపలు పెంచుకునేందుకు బుధవారం ఏర్పాటు చేయాల్సిన బహిరంగ వేలం పాటను అనుకున్న సంఖ్యలో పాటదారులు హాజరు కానందున వాయిదా వేసినట్లు ఈఓఆర్డీ ప్రసన్నకుమార్ తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రారంభ ధర ఎక్కువగా ఉండటం.. గిట్టుబాటుగాక పోవటంతో పాటలో పాల్గొనేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదు. దీంతో పాటను వాయిదా వేసినట్లు గ్రామ కార్యదర్శి షేక్ షహనాజ్ బేగం తెలిపినట్లు ఈఓఆర్డీ వివరించారు. తదుపరి పాట తేదీలను మరోసారి తెలియజేస్తామని పేర్కొన్నారు.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కోర్టువారి ఒంగోలు

G.W.O.P 22/2022

మధ్య–షేక్ షమీమ్ ...పిటీషనర్

మరియు

సూకల సుజన కుమారి ...రెస్పాండెంట్

ఇందు మూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నంబరు పిటీషన్ లో పైనుదహరించిన 1) షేక్ షబీర్ 2) షేక్ జాకీర్ 3) షేక్ ముజీగిర్ లకు చెందిన షెడ్యూల్ ఆస్తి అమ్ముటకు పై నెంబరు పిటీషన్ ను పిటీషనరు దాఖలు చేసి ఉన్నారు సదరు విషయమై ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు ఉన్న యెడల తేదీ 02-03-2023 న ఉదయం 10:30 నిమిషాలకు మీ అభ్యంతరాలు కోర్టు వారి ముందు తెలుపుకోవలసిందిగా యావన్మందికి తెలియపరచటమైనది.

షెడ్యూలు– ప్రకాశం జిల్లా –ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ – ఒంగోలు పురపాలక కార్పొరేషన్ ఏరియా–ఒంగోలు రూరల్ సర్వే నెం.74రు –మొత్తం య.1.50 సె లలో య. 0.33 సెంట్లు లలో గ. 14 .42 చ.అ.లు. లేదా 116.6/9 చదరపు గజాలు లేదా 97.477 చ.మీ ల ఇష్టమైన హక్కులతో కూడిన ఖాళీ స్థలం కు హద్దులు తూర్పు: ఈ స్థలం కు ఉత్తరము వైపు గల ఆస్తి కి పోవుటకు ఐదు అడుగుల బాట దక్షిణం : 40 అడుగుల వెడల్పు గల దారి పడమర: షేక్ ఫాతిమాకు చెందిన ఫ్లాట్ నెం.7రు ఆస్తి ఉత్తరం : పువ్వాడ సత్యవతి నుండి షేక్ షమీమ్ గారు కొన్న ఆస్తి

శ్రీ కోర్టు వారి అనుమతితో

తేదీ :09-02-2023 ఇట్లు : అక్కరాజు నిర్మల్ పిటీషనరు లాయర్, ఒంగోలు. సెల్ : 9848546050

జిల్లా వైద్యశాలలో మొదటి టాన్సిల్ ఆపరేషన్



శస్త్రచికిత్స చేస్తున్న డాక్టర్ రాంబాబు, లత

మార్కాపురం: పట్టణంలోని జిల్లా వైద్యశాలలో మొదటి టాన్సిల్ ఆపరేషన్‌ను విజయవంతంగా చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. జిల్లా వైద్యశాలలోనే డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న లక్ష్మణ్‌సింగ్‌కు గొంతులో గడ్డలు ఏర్పడి గురక, తరుచూ జ్వరం వస్తోంది. ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ ఏర్పడింది. అతడు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఈఎన్‌టీ స్పెషలిస్టు డాక్టర్ రాంబాబు, మత్తు వైద్య నిపుణురాలు లత కలిసి ఆపరేషన్ చేశారు. ఇదే ఆపరేషన్ ప్రైవేటు వైద్యశాలలో చేస్తే 30 నుంచి 40 వేల రూపాయలు ఖర్చు అవుతోందన్నారు. జిల్లా వైద్యశాలలో ఉచితంగా చేశామని డాక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు.

98 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల హర్షం

పర్చూరు: రాష్ట్రంలో 98 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల పోస్టుల భర్తీకి క్యాబినెట్ ఆమోదం తెలపడంపై వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ బాపట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జా సరేష్, దండమూడి శాంతారావు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థపై ఎనలేని కృషి చేస్తున్నారని, గత 30 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న వారికి ఇది తీపి కబురన్నారు.

యువ క్రీడాకారుల ప్రతిభకు 'సాక్షి' కృషి



విజేతలను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

చీరాల: యువ క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు సాక్షి చేస్తున్న కృషి అభినందనీయమని చీరాల ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.రవికుమార్ అన్నారు. సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు జూనియర్స్ విభాగంలో చీరాల ఇంజినీరింగ్ కాలేజీ పాలిటెక్నిక్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ నిబంధనలతో అనుభవం కలిగిన అంపైర్లతో నిర్వహించిన ఈ టోర్నమెంట్ యువ క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని చూపడానికి ఇది చక్కని వేదిక అన్నారు. సాక్షి ఆధ్వర్యంలో మరిన్ని ప్రజా ప్రయోజన కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు. పీడీ కె.శ్రీనివాసరావు, మహాలక్ష్మి, మణికంఠ, రామకృష్ణ పాల్గొన్నారు.